సాక్షి
ఖమ్మం
మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025


ఖమ్మం గొల్లగూడెం ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్

ఈద్గాల్లో సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు ● ప్రవక్త బోధనలు వినిపించిన మతపెద్దలు

నెల పాటు ఉపవాస దీక్ష ఆచరించిన ముస్లింలు సోమవారం రంజాన్(ఈద్ ఉల్ ఫితర్) పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే సమీపంలోని ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రవక్త బోధనలు వినిపించడమే కాక సాటి మానవులకు సాయపడేలా ప్రవక్త బాటను అనుసరించాలని సూచించారు. అనంతరం ముస్లింలు పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఆతర్వాత కులమతాలకతీతంగా స్నేహితులను ఇళ్లకు ఆహ్వానించి విందు ఇచ్చారు. మధిరలోని పలువురు ముస్లింల ఇళ్లకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెళ్లి శుభాకాంక్షలు తెలపగా.. ఖమ్మంలోని గొల్లగూడెం ఈద్గాలో జరిగిన ప్రార్థనలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

- ఫొటోలు 9లో...


మధిర షేక్ గౌసుద్దీన్ నివాసంలో శుభాకాంక్షలు చెబుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


ఖమ్మం గొల్లగూడెం ఈద్గాలో ముస్లింలతో కలిసి దువా చేస్తున్న మంత్రి తుమ్మల

చింతకాని మండలం నామవరంలోని రేషన్‌షాప్‌లో స్టాక్‌ను పరిశీలిస్తున్న డీసీఎస్‌ఓ చందన్‌కుమార్, ఉద్యోగులు | ఓ రేషన్ షాప్ వద్ద ఏర్పాటుచేసిన బోర్డు



సన్నబియ్యం.. సిద్ధం

నేటి నుంచి రేషన్‌షాపుల్లో పంపిణీ

- జిల్లాలో 11.48లక్షల మంది లబ్ధిదారులు
- షాపుల్లో స్టాక్ ఉన్న దొడ్డుబియ్యంపై సందిగ్ధత

ఖమ్మంసహకారనగర్: రేషన్‌షాప్‌ల ద్వారా కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఉగాది నుంచి సన్నబియ్యం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈమేరకు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో బియ్యం పంపిణీని ఇటీవల సీఎం లాంఛనంగా ప్రారంభించారు. ఇక జిల్లాలోని షాపుల్లో మంగళవారం నుంచి బియ్యం పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఫలితంగా దొడ్డుబియ్యం తినలేక రేషన్‌కార్డులు ఉన్నా షాపులకు వెళ్లని పలువురు ఇకపై ముందుకొచ్చే అవకాశముందని భావిస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు సన్నబియ్యం పంపిణీని ప్రారంభించే అవకాశముంది.

షాపులకు స్టాక్

జిల్లాలోని అన్ని రేషన్ షాప్‌ల ద్వారా నేటి నుంచి సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి దుకాణాల కు బియ్యం సరఫరా చేశారు. ఇన్నాళ్లు దొడ్డు బియ్యం ఇస్తుండడం, గత రెండు, మూడు నెలలు గా సక్రమంగా సరఫరా కాకపోవడంతో ఇక్కట్లు ఎదురయ్యాయి. ప్రస్తుతం సన్నబియ్యం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండడంతో ఎలాంటి ఆటంకాలు లేకుండా లబ్ధిదారులకు అందనున్నాయి.

ఈ బియ్యం ఎలా?

జిల్లాలోని అన్ని షాప్‌ల లబ్ధిదారులకు నెలనెలా 7,375.868 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. అయితే, గత నెల షాప్‌లకు చేరవేసిన దొడ్డు బియ్యం నిల్వలు కొన్ని చోట్ల స్టాక్ ఉన్నాయి. సన్నబియ్యం పంపిణీ చేసే క్రమాన జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, ఉద్యోగులు షాపుల్లోని నిల్వలను పరిశీలించి రిజిస్టర్లలో నమోదు చేశాక పక్కన పెట్టించారు. ఈమేరకు దాదాపు 10వేల క్వింటాళ్ల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. అయితే ఈ బియ్యం ఏం చేయాలనే అంశంపై ఇప్పటివరకు స్పష్టత రాలేదని అధికారులు చెబుతున్నారు.

అన్ని షాపుల ద్వారా పంపిణీ



జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయనున్నాం. ఇప్పటికే షాప్‌లకు స్టాక్ చేరవేశాం. ఎక్కడా ఇబ్బంది ఎదురుకాకుండా పంపిణీ చేయాలని సూచించాం. దొడ్డుబియ్యం నిల్వలపై ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాల్సి ఉంది.

– కె.చందన్‌కుమార్, డీసీఎస్‌ఓ

రేషన్ దుకాణాలు	మొత్తం రేషన్‌కార్డులు	లబ్ధిదారులు	ఆహారభద్రత కార్డులు
748	4,10,988	11,48,031	3,83,717

జిల్లాలో రేషన్ వ్యవస్థ వివరాలు ▶	అంత్యోదయ	అన్నపూర్ణ	బియ్యం కేటాయింపు
	27,268	03	7,375.868 మెట్రిక్ టన్నులు


న్యూస్‌రీల్

జమలాపురంలో ధ్వజారోహణం


ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించిన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, శ్రీవారి పాదానికి పంచామృతంతో అభిషేకం చేశారు. ఆతర్వాత ధ్వజారోహణం చేయడమే కాక రుద్ర హోమం నిర్వహించిన అర్చకులు శ్రీవారు, అమ్మవార్లను గజవాహనంపై గిరి ప్రదక్షిణ చేయించారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ, సూపరింటెడెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

రామదాసు మందిరంలో చెన్నై భక్తుల కచేరీ


కచేరీ చేస్తున్న చెన్నై భక్తులు

నేలకొండపల్లి: భక్త రామదాసు జన్మస్థలమైన నేలకొండపల్లిలోని రామదాసు ధ్యాన మందిరంలో చెన్నైకి చెందిన భక్తులు కచేరీ నిర్వహించారు. దేశంలోని అన్ని రామదాసు మందిరాలను సందర్శించి కచేరీలు చేస్తున్న 15మంది బృందం సోమవారం నేలకొండపల్లికి చేరింది. ఈ సందర్భంగా రామదాసు వాడిన బావితో పాటు ఆడిటోరియంలోని పరిశీలించాక ఆయన విగ్రహం వద్ద పూజలు చేశారు. ఆతర్వాత మందిరంలో రామదాసు కీర్తనలతో కచేరీ నిర్వహించగా పలువురు స్థానికులు సైతం పాల్గొన్నారు. మందిరం పూజారి సౌమిత్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈగా యుగంధర్

ఖమ్మంఅర్బన్: ఆర్‌అండ్‌బీ ఖమ్మం సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్‌ఈ)గా వి.యుగంధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా ఉన్న హేమలత ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఖమ్మం ఈఈ యుగంధర్‌కు ఎస్‌ఈగా అదనపు బాధ్యతలు అప్పగించడంతో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ఇంజనీర్లు, కార్యాలయ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్పత్తిలో సింహభాగం సత్తుపల్లిదే..


మాట్లాడుతున్న సీఎండీ బలరాంనాయక్, పక్కన అధికారులు

- గత ఏడాదితో కంటే మెరుగైన ఉత్పత్తి, రవాణా
- సీఎండీ బలరాంనాయక్

సత్తుపల్లి: బొగ్గు ఉత్పత్తి, రవాణాలో సింగరేణి వ్యాప్తంగా సత్తుపల్లి సింహభాగాన నిలుస్తోందని సంస్థ సీఎండీ బలరాంనాయక్ వెల్లడించారు. ఇందుకు శ్రమించిన కార్మికులు మొదలు అధికారుల వరకు అభినందనీయులని తెలిపారు. సత్తుపల్లి మండలం జేవీఆర్ ఓసీ ఆవరణలో సోమవారం రాత్రి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది సత్తుపల్లి ఓసీల ద్వారా గతేడాది కంటే 6లక్షల టన్నులు అధికంగా 144.55 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందని, 162.23 లక్షల టన్నులు రవాణా చేశామని తెలిపారు. మార్చి 28వ తేదీన 80,931లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తితో రికార్డు సృష్టించడం విశేషమన్నారు. కాగా, సత్తుపల్లి జీఎం కార్యాలయాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని సీఎండీ వెల్లడించారు.

గ్లోబల్‌గా సంస్థగా...

కొత్తగూడెం వీకే ఓసీ, ఇల్లెందు రొంపెడు ఓసీలకు అనుమతులు వచ్చాయని వెల్లడించిన సీఎండీ... త్వరలోనే ఆయా గనుల్లో ఉత్పత్తి మొదలుపెడతామని తెలిపారు. ఒడిశా రాష్ట్రంలో పది మిలియన్ టన్నుల ఉత్పత్తికి ఒప్పందం కుదిరిందని చెప్పారు. రాజస్తాన్‌లో 3,100 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నామని, ఆస్ట్రేలియాలోనూ బొగ్గు ఉత్పత్తికి ప్రణాళికలు ఉన్నందున సింగరేణి గ్లోబల్‌గా సంస్థగా అవతరిస్తుందని తెలిపారు. అలాగే, బొగ్గు నాణ్యత విషయంలో గతంలో ఫిర్యాదులు వచ్చేవని.. ఇప్పుడు అవి తగ్గాయని వివరించారు.

సీఎండీని కలిసిన సైలోబంకర్ బాధితులు

కిష్టారం అంబేద్కర్ కాలనీకి చెందిన సైలో బంకర్ బాధితులు సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను కలిసి వారి సమస్యలు వివరించారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే ద్వారా మంత్రుల స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని..త్వరలో ఒక పరిష్కారం చూపిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, జీఎం షాలెంరాజు, పీఓలు ప్రహ్లాద్, నర్సింహారావు, ఏసీపీ ఎ.రఘు, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ గడువు

జిల్లాలో రూ.53.27కోట్ల ఫీజు వసూలు

ఖమ్మంమయూరిసెంటర్: లే ఔట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్‌ఆర్‌ఎస్) ద్వారా దరఖాస్తుల ఆమోదం కోసం 25శాతం రాయితీతో ఫీజు చెల్లించే గడువు సోమవారంతో ముగిసింది. 2020 ఆగస్టులో ఎల్‌ఆర్‌ఎస్ పథకం కోసం రూ.వెయ్యి చెల్లించిన దరఖాస్తుదారులు నిర్దేశిత ఫీజు చెల్లించేలా ప్రభుత్వం రాయితీని ప్రకటించింది. మార్చి 31లోగా చెల్లిస్తే 25 శాతం రాయితీ ఇస్తామని వెల్లడించడంతో పలువురు ముందుకొచ్చినా అందరు మాత్రం చెల్లించలేకపోయారు. దీంతో గడువు ముగిసే నాటికి జిల్లాలో రూ.51.69 కోట్ల మేర ప్రభుత్వానికి జమ అయింది.

కేఎంసీలో రూ.37.85కోట్లు

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, సుడా, గ్రామపంచాయతీల్లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 2020లో దరఖాస్తులు అందాయి. రాయితీ ప్రకటనతో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం రాత్రి 9గంటలకు అందిన సమాచారం మేరకు 7,003 మంది ఫీజు చెల్లించగా.. రూ.39.43 కోట్లు ఆదాయం వచ్చింది. వైరా మున్సిపల్ పరిధిలో 385దరఖాస్తులకు రూ.1.53 కోట్లు, మధిరలో 589 మంది రూ.3.12 కోట్లు, ఏదులాపురం పరిధిలో 1,554 మంది రూ.6.55 కోట్లు, సత్తుపల్లి మున్సిపల్ పరిధిలో 471 మంది రూ.2.35 కోట్లు చెల్లించారు. జిల్లాలోని సుడా, గ్రామపంచాయతీలు, కేఎంసీ, మున్సిపాలిటీలన్నీ కలిపి రూ.53.27 కోట్ల మేర ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు ప్రభుత్వానికి జమ అయింది. అయితే, రాయితీ గడువు ఇంకొన్ని రోజులు పొడిగించి సాంకేతిక సమస్యలు ఎదురుకాకుండా చూస్తే భారీగా ఫీజు సమకూరే అవకాశముంది. ఈనేపథ్యాన ప్రభుత్వం గడువు పెంచుతుందనే ఆశతో వేలాది మంది ఎదురుచూస్తున్నారు.

పరమశివుడికి లక్ష బిల్వార్చన

పాల్వంచరూరల్ : పాల్వంచ మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రీదేవి వసంత నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజైన సోమవారం అమ్మవారి ఆలయ సన్నిధిలోని శివాలయంలో స్వామి వారికి లక్ష బిల్వార్చన, శ్రీచక్రార్చన పూజలు నిర్వహించారు. ఆ తర్వాత నాదనీరాజనం, సూక్తి పారాయణం, ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి లక్ష కుసుమార్చన, శ్రీలలితా సహస్రనామ హవనం నిర్వహించి హారతి సమర్పించారు.



స్కూల్ 'అడ్రస్' మారింది !

జింకలతండాకు బదులు రఘునాథపాలెం బైపాస్‌లో స్థలం

రఘునాథపాలెం: ఖమ్మం నియోజకవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం అనువుగా లేదని తేల్చడంతో ఇంకో చోట భూమి గుర్తించారు. తొలుత రఘునాథపాలెం మండలంలోని జింకల తండా క్రాస్ సమీపాన సర్వే నంబర్ 20లో ప్రభుత్వ భూమిని కేటాయించారు. దీంతో గత ఏడాది అక్టోబర్ 11న మంత్రులు శంకుస్థాపన కూడా చేశారు. అయితే, ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన ఇంజనీరింగ్ అధికారులు భవన సముదాయం నిర్మాణానికి అనువుగా లేదని నివేదిక సమర్పించారు. ఈమేరకు వారం క్రితం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఆర్డీఓ నర్సింహారావు, తహసీల్దార్ విల్సన్‌బెన్నీ మండలంలోని పువ్వాడనగర్, రఘునాథపాలెం బైపాస్‌లోని అసైన్డ్ భూములను సందర్శించారు. చివరకు మెడికల్ కాలేజీ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం పక్కన 218 సర్వేనంబర్‌లోని భూములు అనువుగా ఉన్నాయని గుర్తించినట్లు సమాచారం. దీంతో 20ఎకరాల మేర అసైన్డ్ పట్టాలు కలిగిన రైతులతో రెవెన్యూ అధికారులు సంప్రదింపులు మొదలుపెట్టారు. భూమి కలిగిన ప్రతీ ఒక్కరికి 300గజాల స్థలం కేటాయించి అన్ని హక్కులు కల్పిస్తామనే ఒప్పందంతో వారిని ఒప్పించినట్లు తెలిసింది. మెడికల్ కాలేజీ నిర్మాణాలకు సైతం ఇదే తరహాలో ఒప్పించడంతో ఇక్కడి రైతులు సైతం ముందుకొచ్చినట్లు సమాచారం. నాలుగైదు రోజుల్లో స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఇంజనీరింగ్ అధికారులకు అప్పగిస్తారని తెలుస్తోంది. ఫలితంగా స్థలం మారినప్పటికీ రఘునాథపాలెం మండలంలోనే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించనుండడంపై మండల వాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

గిరిజన మ్యూజియం ఆకట్టుకోవాలి : పీఓ

భద్రాచలంటౌన్: పర్యాటకులను ఆకట్టుకునేలా గిరిజన మ్యూజియాన్ని తీర్చిదిద్దాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. మ్యూజియంలో ఏర్పాటుచేసిన వివిధ కళాఖండాలు, పెయింటింగ్ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాతకాలపు ఇళ్ల వలె తీర్చిదిద్దిన వాటిలో సందర్శకులు కూర్చునేందుకు కుర్చీలు, టేబుళ్లు ఏర్పాటుచేయాలని సూచించారు. గిరిజన తెగలకు సంబంధించిన సంప్రదాయ దుస్తులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఆర్ఓ ప్లాంట్, రిసెప్షన్ కౌంటర్ ఉండాలని, మ్యూజియం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, అధికారులు వేణు, ప్రభాకర్‌రావు, గోపాలరావు, శ్రీనివాస్, రవి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెంచలేదని అనకుండా..

- ఉపాధి కూలీలకు రోజువారీ వేతనం రూ.7 పెంపు
- ఉత్తర్వులు విడుదల చేసిన కేంద్రం
- వేసవిభత్యం ఊసే ఎత్తని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు



ఖమ్మంమయూరిసెంటర్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఈసారి నామమాత్రంగానే వేతనం పెరిగింది. గత సంవత్సరంతో పోలిస్తే ఇది చాలా తక్కువ కావడం గమనార్హం. ఇప్పటి వరకు ఒక్కో కూలీకి రూ.300 చెల్లిస్తుండగా.. ఈసారి మరో రూ.7పెంచుతూ కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మంగళవారం నుంచి కూలీలకు రూ.307 చెల్లించనున్నారు. అతి తక్కువగా వేతనం పెంచడంపై కూలీల్లో నిరాశ అలుముకుంది.

నాలుగో వంతు

ఏటా ఉపాధి కూలీల వేతనాన్ని రూ.15నుంచి రూ.25మేర పెంచుతున్నారు. దీంతో ప్రస్తుతం కూలీలకు రూ.300 అందుతుండగా ఈసారి అతి తక్కువగా రూ.7మాత్రమే పెంచడం గమనార్హం. 2024–25 ఏడాదికి రూ.28 పెంచిన కేంద్రం.. 2025–26కు అందులో నాలుగో వంతు మాత్రమే పెంచడంతో కూలీలు పనులపై విముఖత చూపే అవకాశం కనిపిస్తోంది.

58.28 లక్షల పనిదినాలు పూర్తి

2024–25 ఏడాదిలో 62.17 లక్షల పనిదినాలకు గాను 58.28 లక్షలు మాత్రమే పూర్తయ్యాయి. ఇందులో 1,419 కుటుంబాలు వంద రోజుల పనిదినాలు పూర్తి చేశాయి. ఈ పనుల కోసం రూ.204.99 కోట్లు వెచ్చించగా.. అందులో రూ.127.39 కోట్లు కూలీలకు వేతనంగా, రూ.67.27 కోట్లు సామగ్రి కోసం ఖర్చు చేశారు. మరో రూ.10 కోట్లు కార్యకలాపాలు, ఉద్యోగుల వేతనాలు, కార్యాలయాల నిర్వహణకు వెచ్చించారు.

ఈసారి 54 లక్షల పనిదినాలే

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు దొరకని వేసవి సమయంలో ఉపాధి హామీ పనులకు వెళ్లడానికి కూలీలు ఆసక్తి కనబరుస్తారు. జిల్లాలోని చాలా మండలాల్లో కూలీల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. ఈనేపథ్యాన ఉపాధి హామీ పనిదినాల లక్ష్యాలను కేంద్రమే నేరుగా పర్యవేక్షిస్తోంది. ఉపాధి పథకం పనులకు వచ్చే కూలీల సంఖ్య ఆధారంగా గ్రామం, బ్లాక్(మండలం), జిల్లాకు పనిదినాల లక్ష్యాలను నిర్దేశిస్తుంది. ఈమేరకు జిల్లా నుంచి 2025–26 ఆర్థిక సంవత్సరంలో 54,33,704 పనిదినాలు కల్పించేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. తాజాగా ముగిసిన ఏడాదిలో నిర్దేశిత లక్ష్యాన్ని చేరకపోవడంతోనే ఈసారి పనిదినాల సంఖ్య తగ్గించినట్లు తెలుస్తోంది. అయితే, ప్రతిపాదనల ఆధారంగా నెలవారీ లక్ష్యాలను కేంద్రప్రభుత్వం ప్రకటించనుండగా.. అందుకు అనుగుణంగా జిల్లాలో కూలీలకు పనులు కల్పిస్తారు.

జిల్లాలో 'ఉపాధి' వివరాలు

జాబ్‌కార్డులు	3.06 లక్షలు
కూలీల సంఖ్య	6.43 లక్షలు
యాక్టివ్ జాబ్‌కార్డులు	1.83 లక్షలు
యాక్టివ్ కూలీలు	3.08 లక్షలు

వేసవిభత్యానికి రాంరాం..



వేసవిలో ఎండల తీవ్రత ఉన్నా పనులకు వచ్చే వారిని ప్రోత్సహించేలా కూలీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేసవిభత్యం చెల్లించడం ఆనవాయితీ. కానీ గత ఏడాది వేసవిభత్యం ప్రకటించకపోగా, ఈసారి కూడా అలాంటి ప్రకటన వెలువడలేదు. దీంతో అసలు వేసవిభత్యం ఉంటుందా, తొలగించారా అన్న మీమాంస నెలకొంది. కాగా, కూలీలకు తాగునీరు సమకూర్చేందుకు మాత్రం గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయనుంది. ఒక్కో కూలీకి రూ.2.50 చొప్పున జీపీలకు కేంద్రం నిధులు విడుదల చేస్తుండగా, ఆ నిధులతో పని ప్రదేశాల్లో నీటి వసతి కల్పించాల్సి ఉంటుంది.

ఖమ్మం–కోదాడ పాత రోడ్డుకు మహర్దశ

- జాతీయ రహదారుల అథారిటీ నుంచి నిధులు
- 18 కి.మీ. మేర రహదారికి రూ.20 కోట్లు

నేలకొండపల్లి: జాతీయ రహదారి అందుబాటులోకి వచ్చాక పట్టించుకునే వారెవరూ లేక పాత రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది. గుంతలు తేలిన ఈ రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారిన నేపథ్యాన ఎట్టకేలకు జాతీయ రహదారుల అథారిటీ నుంచి ఖమ్మం–కోదాడ రహదారి అభివృద్ధికి రూ.20కోట్ల నిధులు మంజూరవడంతో త్వరలోనే కొత్తరూపు సంతరించుకోనుంది. 365(ఏ) నంబర్‌తో ఖమ్మం–కోదాడ మధ్య జాతీయ రహదారి నిర్మాణం పూర్తయింది. అంతకుముందు ఖమ్మం నుంచి ముదిగొండ – నేలకొండపల్లి – పైనంపల్లి మీదుగా రాకపోకలు సాగేవి. హైవే నిర్మాణం జరిగిన నాలుగేళ్ల పాటు అంతకుముందు వేలాదిగా వాహనాలు ఇదే రోడ్డుపై వచ్చివెళ్లడంతో గుంతలమయమై అధ్వానంగా మారింది. ప్రస్తుతం కొత్త హైవేపై భారీ వాహనాల రాకపోకలు సాగుతున్నా, పలు గ్రామాల ప్రజలకు పాత రహదారే ప్రత్యామ్నాయంగా ఉంది. కానీ తారు లేచిపోయి గుంతలు తేలడంతో ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్న వారి వాహనాలు దెబ్బతినడమే కాక ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. అప్పుడప్పుడు మరమ్మతులు చేస్తున్నా శాశ్వత పనులు చేపట్టకపోగా.. చివరకు జాతీయ రహదారుల అథారిటీ నిధులు మంజూరు చేశారు.


గుంతలమయంగా మారిన ఖమ్మం- కోదాడ పాత రోడ్డు

ఆర్‌అండ్‌బీ ద్వారా పనులు

ఖమ్మం – కోదాడ మార్గంలోని పాత రహదారిపై కొత్తగా బీటీ వేసేందుకు రూ.20కోట్లు మంజూరు చేశారు. ఖమ్మం నుంచి కోదాడ వరకు 18 కి.మీ. మేర ఈ రోడ్డును అభివృద్ధి చేస్తారు. ఖమ్మం, ముదిగొండ బైపాస్, నేలకొండపల్లి, పైనంపల్లి మీదుగా కోదాడ వరకు చేపట్టే పనులకు గాను జాతీయ రహదారుల అథారిటీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఖాతాలో నిధులు జమ చేశారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా చేపట్టే పనులు త్వరలోనే మొదలుకానున్నాయి.

నిధులు విడుదల అయ్యాయి..

జాతీయ రహదారి అథారిటీ నుంచి పాత రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. బైపాస్‌లు కలుపుతూ 18 కి.మీ. మేర రహదారి అభివృద్ధికి రూ.20 కోట్లు కేటాయించారు. ఈ పనులను త్వరలోనే ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యాన చేపడతారు.

– దివ్య, పీడీ, నేషనల్ హైవేస్

క్లుప్తంగా

గ్రూప్‌-1లో రాష్ట్రస్థాయి 63వ ర్యాంకు

కాకరవాయి వాసి వంశీ ప్రతిభ


ఖుషీల్‌ వంశీ

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయికి చెందిన కొత్తపల్లి ఖుషీల్‌వంశీ గ్రూప్‌-1 ఫలితాల్లో సత్తా చాటాడు. గ్రామంలోని కొత్తపల్లి శివకుమార్‌ – రేణుక కుమారుడైన వంశీ 496 మార్కులతో జనరల్‌ కేటగిరీలో 63, రిజర్వేషన్‌ కేటగిరీలో రాష్ట్రస్థాయి మూడో ర్యాంకు సాధించాడు. దీంతో డిప్యూటీ కలెక్టర్‌ లేదా డీఎస్పీ ఉద్యోగం వస్తుందని ఆశిస్తున్నాడు. గతంలో ఆయన ఎస్సై ఉద్యోగానికి ఎంపికవడమే కాక ఇన్‌కం టాక్స్‌ అసిస్టెంట్‌, సెంట్రల్‌ పోలీస్‌ అసిస్టెంట్‌ కమాండో(డీఎస్పీ), మిలిటరీ ఆఫీసర్‌గానూ ఉద్యోగాలు సాధించాడు. కాగా, వంశీ 6నుంచి 10వ తరగతి వరకు ఖమ్మం శ్రీచైతన్య పాఠశాలలో, ఇంటర్‌ హైదరాబాద్‌ శ్రీ గాయత్రి కళాశాలలో పూర్తిచేశాక సివిల్స్‌ సాధనే లక్ష్యంగా డిగ్రీ హైదరాబాద్‌ శ్రీ చైతన్య ఐఏఎస్‌ అకాడమీలో, పీజీ ఢిల్లీ జేఎన్‌యూలో పూర్తిచేశాడు. కాగా, వంశీ తండ్రి శివకుమార్‌ సూర్యాపేట జిల్లా మాస్‌లైన్‌ జిల్లా కార్యదర్శిగా, తల్లి రేణుక పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొనసాగుతున్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి పాటుపడుతున్న తల్లిదండ్రుల మాదిరే ప్రజలకు సేవ చేయడం తన లక్ష్యమని ఖుషీల్‌ వంశీ వెల్లడించాడు.

సింధు.. 176వ ర్యాంకు


నెల్లూరి సింధు

నేలకొండపల్లి: మండలంలోని మండ్రాజుపల్లికి చెందిన నెల్లూరి సింధు గ్రూప్‌-1 ఫలితాల్లో ప్రతిభ కనబరిచింది. ఆమె మల్టీజోన్‌ మహిళా కోటాలో 64వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 176వ ర్యాంకు సాధించింది. అయితే, 2016లోనే గ్రూప్‌-2లో ప్రతిభ కనబరిచి ఎంపీఓగా, గ్రూప్‌-3 ద్వారా సీనియర్‌ అకౌంటెంట్‌ ఉద్యోగాలు సాధించిన సింధు ప్రస్తుతం ఖమ్మం మున్సిపల్‌ కార్పొరేషన్‌లో వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం వదిలేసి గ్రూప్స్‌ సిద్ధమయ్యాయని, రోజుకు 15గంటల పాటు చదవడంతో మంచి ఫలితం వచ్చిందని.. ఇందులో భర్త, కుటుంబ సభ్యుల సహకారం మరువలేనిదని వెల్లడించింది.

వ్యవసాయ కుటుంబం.. 48వ ర్యాంక్‌


గంద్ర నవీన్‌రెడ్డి

ఖమ్మం సహకారనగర్‌: ఖమ్మం రాపర్తినగర్‌లో నివాసముంటున్న గంద్ర నవీన్‌రెడ్డి గ్రూప్‌-1 ఫలితాల్లో 502మార్కులతో రాష్ట్రస్థాయి 42వ ర్యాంక్‌ సాధించాడు. ముదిగొండ మండలం మాధాపురానికి చెందిన గంద్ర మల్లికార్జున్‌రెడ్డి – లక్ష్మి వ్యవసాయ కుటుంబం కాగా కొన్నాళ్ల నుంచి ఖమ్మంలో ఉంటున్నారు. వీరి కుమారుడు నవీన్‌ సివిల్స్‌ సాధించాలనే లక్ష్యంతో ఓసారి ఇంటర్వ్యూకు సైతం హాజరయ్యాడు. ఇంతలోనే గ్రూప్‌-1 నోటిఫికేషన్‌ రావడంతో పరీక్ష రాయగా 48వ ర్యాంక్‌ వచ్చింది. ఎప్పటికైనా సివిల్స్‌ సాధించి పేదవర్గాలకు సేవ చేయాలనేదే తన లక్ష్యమని నవీన్‌ వెల్లడించాడు. కాగా, ప్రస్తుతం వచ్చిన ర్యాంక్‌ ఆధారంగా డీఎస్పీ లేదా ఆర్డీఓ ఉద్యోగం వచ్చే అవకాశముందని తెలిపాడు.

అర్చక, ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్‌: దేవాదాయ శాఖ పరిధిలోని అర్చకుల, ఉద్యోగ డైరీని సోమవారం ఖమ్మం కమాన్‌బజార్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అర్చక, ఉద్యోగ జేఏసీ చైర్మన్‌ గంగు ఉపేందరశర్మ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 16,062 ఆలయాల్లో పనిచేస్తున్న అర్చక, ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదిక అందించామని తెలిపారు. దీంతో ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కాగా, అర్చక, ఉద్యోగులు ఐక్యమత్యంతో ఉంటూ ఆలయాల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీఎస్‌.శ్రీనివాసాచారి, అర్చకులు శేషభట్టర్‌ రఘునాథాచార్యులు, కాండూరి మధుసూదనాచార్యులు, వేణుగోపాలాచార్యులు, శేషభట్టార్‌ వెంకటాచార్యులు, ఉద్యోగులు కొండకింది వేణుగోపాలాచార్యులు, దయాకర్‌, బురాన్‌ తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలతో మేలు


మాట్లాడుతున్న చిలుకూరు రమేష్‌

ఏన్కూరు: అసెంబ్లీ, పార్లమెంట్‌ ఎన్నికలు ఒకేసారి నిర్వహించడం ద్వారా పాలన కుంటుపడకపోగా నిధులు ఆదా అవుతాయని బీజేపీ కిసాన్‌ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరు రమేష్‌ అన్నారు. ఏన్కూరులో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'వన్‌ నేషన్‌ – వన్‌ ఎలక్షన్‌' విధానాన్ని 32పార్టీలు సమర్థిస్తే కాంగ్రెస్‌ సహా ఇంకొన్ని పార్టీలు రాద్ధాంతం చేస్తున్నాయని పేర్కొన్నారు. దీంతో ఈ విధానం వల్ల జరిగే మేలును ప్రజలకు వివరించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసమావేశంలో నాయకులు నల్లమోతు రమేష్‌, నరుకుళ్ల వెంకటేశ్వర్లు, మాళ్ల అంజి, చింతలబోయిన వెంకటేశ్వర్లు, మల్లెం రవి పాల్గొన్నారు.

యాప్‌లోనే హోరాహోరీ

- ఐపీఎల్‌ వేళ ఆన్‌లైన్‌లో పందేల జోరు
- ప్రతీ బంతి, ఓవర్‌... వికెట్‌పై బెట్టింగ్‌
- పాల్గొంటున్న వారిలో యువతే ఎక్కువ...



ఖమ్మం స్పోర్ట్స్‌: ప్రతీ బాల్‌.. వికెట్‌.. ఓవర్‌ ఇలా చెబుతూ పోతే బెట్టింగ్‌రాయుళ్లకు దేన్నీ వదలడం లేదు. ప్రస్తుతం ఇండియన్‌ ప్రీమియర్‌ లీగ్‌(ఐపీఎల్‌) 18వ సీజన్‌ కొనసాగుతుండడంతో పందేలు జోరందుకున్నాయి. అయితే, ఈ బెట్టింగ్‌లో యువత ఎక్కువగా పాల్గొంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఐపీఎల్‌ మ్యాచ్‌ మొదలైందంటే చాలు బుకీలు యాప్‌ల ద్వారా యువతను ఆకర్షిస్తున్నారు. దీంతో అవగాహన లేకున్నా కొందరు వివరాలు తెలుసుకుని మరీ బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిసింది. బెట్టింగ్‌కు ప్రత్యేకంగా యాప్‌లు ఉండగా.. వీటి వివరాలను యువతకు వివరిస్తూ బుకీలు పందేనికి ప్రోత్సహిస్తున్నారు. రూ.100తో ప్రారంభమయ్యే ఈ బెట్టింగ్‌తో రూ.వేలల్లో సులువుగా సంపాదించవచ్చని ప్రచారం చేస్తుండగా.. సంపాదన మాటేమో కానీ ఎక్కువ మంది రూ.వేలల్లో పోగొట్టుకుని లబోదిబోమంటున్నారు. కొన్నేళ్ల క్రితం వరకు ఖమ్మం కేంద్రంగా యువకులు ఈ బెట్టింగ్‌కు పాల్పడగా, ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు సోకడంతో బుకీల ఫోన్‌ నంబర్లు సేకరించి మరీ యాప్‌ల ద్వారా పందేనికి సిద్ధమవున్నారు.

ముందుగానే అకౌంట్‌ లింక్‌..

బుకీలు చెప్పిన యాప్‌ డౌన్‌లోడ్‌ చేసుకున్నాక పందేం కాసే వ ఆరు తమ బ్యాంక్‌ అకౌంట్‌ నంబర్‌, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్‌ తదితర వివరాలు నమోదు చేసుకోవాలని చెబుతున్నట్లు తెలిసింది. ఆపై పరుగు, వికెట్‌, ఫోర్‌, సిక్స్‌లకు ఎంత అని నిర్ణయించి పందేనికి ఆహ్వానిస్తున్నట్లు సమాచారం. అంతేకాక ప్రతీ బెట్టింగ్‌కు కోడ్‌ ఇస్తూ నమ్మకం ఉంటేనే ఆ కోడ్‌ నమోదు చేయాలని, తద్వారా నష్టపోయే అవకాశం లేదని నమ్మబలుకుతున్నట్లు తెలిసింది. దీంతో యువకులు ఎవరికి వారు నమ్మకంగా బెట్టింగ్‌ కాస్తూ నష్టపోతున్నట్లు సమాచారం.

బార్లలో జోరుగా బెట్టింగ్‌

ఖమ్మంలోని త్రీ టౌన్‌, టూ టౌన్‌, వన్‌ టౌన్‌ ప్రాంతాల బార్లలో బెట్టింగ్‌ జోరుగా కొనసాగుతుందని చెబుతున్నారు. యాప్‌ల ద్వారా కొందరు.. నేరుగా కొందరు పందేలు కాస్తున్నట్లు సమాచారం. కాగా, ఐపీఎల్‌ మ్యాచ్‌ల సందర్భంగా బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకులు డబ్బుల కోసం తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. రకరకాల కారణాలు చెబుతూ డబ్బులు అడుగుతుండడంతో.. ఐపీఎల్‌ ఎప్పుడు ముగుస్తుందా అని తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు.

క్రికెటే కాదు మరిన్ని...

బెట్టింగ్‌ యాప్‌లు ఇన్నాళ్లు క్రికెట్‌కే పరిమితం అయ్యాయని భావిస్తుండగా.. ఇంకొన్ని ఆటల్లోనూ ఈ సంస్కృతి మొదలైందని చెబుతున్నారు. ఫుట్‌బాల్‌, టెన్నిస్‌, కబడ్డీ, గుర్రపు పందేలనైనా బెట్టింగ్‌ యాప్‌లు పని చేస్తున్నాయని సమాచారం. ఎవరికి ఏ క్రీడపై ఆసక్తి ఉందో కనుక్కుని మరీ బుకీలు ఈ యాప్‌లను విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు తెలిసింది.

బెట్టింగ్‌ ఇలా...

బుకీలు చెప్పేవే కాక మరికొన్ని యాప్‌ల ద్వారా బెట్టింగ్‌ జోరుగా సాగుతోంది. ఫోన్‌లో యాప్‌ డౌన్‌లోడ్‌ చేసుకున్నాక మ్యాచ్‌ ప్రత్యక్ష ప్రసారం అవుతుంటుంది. అంతేకాక స్క్రీన్‌పై కింద భాగంలో బెట్టింగ్‌ వివరాలను బుకీలు జోడిస్తుంటారు. దీంతో టాస్‌ ఎవరు గెలుస్తారు.. ఆటగాళ్ల వ్యక్తిగత స్కోర్‌, వచ్చే బంతికి ఎన్ని పరుగులు వస్తాయి, ఫలానా బౌలర్‌ ఈ ఓవర్‌లో వికెట్‌ తీస్తాడా, మొత్తంగా ఎవరు గెలుస్తారు ఇలా ప్రతీ అంశానికి బెట్టింగ్‌ కాస్తుండడంతో నమ్మకంగా ముందుకొస్తున్న యువత చివరకు నష్టపోతున్నారు.

వ్యవసాయ శాఖకు కొత్త ఫోన్‌ నంబర్లు

డీఏఓ మొదలు ఏఓల వరకు కేటాయింపు



జిల్లావ్యాప్తంగా వ్యవసాయ శాఖ అధికారుల ఫోన్‌ నంబర్లు మారాయి. జిల్లా వ్యవసాయాధికారి మొదలు కార్యాలయంలో పనిచేసే అధికారులు, ఏడీఏలు, ఏఓలకు కొత్త నంబర్లు కేటాయించారు. ఎయిర్‌టెల్‌ నంబర్లను వ్యవసాయ శాఖ కేటాయించగా, ఇకపై ఇదే నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

– ఖమ్మంవ్యవసాయం

హోదా	ఫోన్‌ నంబర్‌	హోదా	ఫోన్‌ నంబర్‌
జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం		ఏఓ, కామేపల్లి	89777 46620
జిల్లా వ్యవసాయాధికారి	89777 47500	**కూసుమంచి డివిజన్‌**	
ఏడీఏ, టెక్నికల్‌	89777 47501	ఏడీఏ	89777 47212
ఏడీఏ, టెక్నికల్‌	89777 47502	ఏఓ (టెక్నికల్‌)	89777 47220
పరిపాలనా అధికారి	89777 47503	ఏఓ, నేలకొండపల్లి	89777 47216
ఏఓ, టెక్నికల్‌	89777 47396	ఏఓ, కూసుమంచి	89777 47217
ఏఓ, టెక్నికల్‌	89777 47397	ఏఓ, ఖమ్మం రూరల్‌	89777 47218
ఏఓ, టెక్నికల్‌	89777 47398	ఏఓ, తిరుమలాయపాలెం	89777 47219
ఏఓ, టెక్నికల్‌	89777 47399	**మధిర డివిజన్‌**	
రైతు శిక్షణా కేంద్రం(ఎఫ్‌టీసీ)		ఏడీఏ	89777 46574
డిప్యూటీ డైరెక్టర్‌	89777 46566	ఏఓ (టెక్నికల్‌)	89777 48680
ఏడీఏ	89777 46572	ఏఓ, మధిర	89777 46575
వ్యవసాయాధికారి	89777 48420	ఏఓ, బోనకల్‌	89777 46576
వ్యవసాయాధికారి	89777 48442	ఏఓ, చింతకాని	89777 46578
వ్యవసాయాధికారి	89777 48443	ఏఓ, ముదిగొండ	89777 46579
వ్యవసాయాధికారి	89777 48612	ఏఓ, ఎర్రుపాలెం	89777 46580
బీసీ ల్యాబ్‌		**వైరా డివిజన్‌**	
ఏడీఏ	89777 46573	ఏడీఏ	89777 48708
వ్యవసాయాధికారి	89777 48677	ఏఓ, వైరా	89777 48709
వ్యవసాయాధికారి	89777 48679	ఏఓ, కొణిజర్ల	89777 48710
భూసార పరీక్షా కేంద్రం (ఎస్‌టీఎల్‌)		ఏఓ, ఏన్కూరు	89777 46597
ఏడీఏ	89777 47389	ఏఓ, కారేపల్లి	89777 46598
వ్యవసాయాధికారి	89777 47390	**సత్తుపల్లి డివిజన్‌**	
వ్యవసాయాధికారి	89777 47391	ఏడీఏ	89777 48722
వ్యవసాయాధికారి	89777 47394	ఏఓ (టెక్నికల్‌)	89777 46623
వ్యవసాయాధికారి	89777 47395	ఏఓ (భూసార పరీక్షలు)	89777 47510
ఖమ్మం డివిజన్‌		ఏఓ, సత్తుపల్లి	89777 48723
ఏడీఏ	89777 46617	ఏఓ, వేంసూరు	89777 48724
ఏఓ (టెక్నికల్‌)	89777 46621	ఏఓ, పెనుబల్లి	89777 48725
ఏఓ, ఖమ్మం అర్బన్‌	89777 46618	ఏఓ, కల్లూరు	89777 48728
ఏఓ, రఘునాథపాలెం	89777 46619	ఏఓ, తల్లాడ	89777 48729

ప్రార్థనలకు రాజకీయ నాయకులు వద్దు..

- మాజీ మంత్రి పాల్గొనడంపై ముస్లింల అభ్యంతరం
- కాంగ్రెస్‌ నేతల ఉపన్యాసాలకూ అడ్డు


ప్రార్థన మధ్యలో బయటకు వస్తున్న మాజీ మంత్రి పువ్వాడ

ఖమ్మం అర్బన్‌: రంజాన్‌ సందర్భంగా ఖమ్మం గొల్లగూడెం ఈద్గా వద్ద సోమవారం పెద్దసంఖ్యలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. అయితే, ప్రార్థనలో ముస్లింలతో పాటు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ పాల్గొనడంపై పలువురు అభ్యంతరం తెలిపారు. ప్రార్థనలో హిందువులు పాల్గొనవద్దని, పక్కన ఏర్పాటుచేసిన టెంట్‌ కింద కూర్చుని ప్రార్థన ముగిశాక శుభాకాంక్షలు తెలపాలని అన్నారు. దీంతో పువ్వాడ సమీపంలోని టెంట్‌ వద్దకు చేరుకుని, ఆతర్వాత ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపి వెళ్లిపోయారు. కాగా, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రార్థన ముగిశాక ఈద్గాకు వచ్చి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అయితే, అక్కడ మిగిలి ఉన్న వారిని ఉద్దేశించి తుమ్మల సమక్షాన ముస్లిం నాయకులు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించే ప్రయత్నం చేయబోగా పలువురు అడ్డుచెప్పారు. పవిత్రమైన రంజాన్‌ పండుగ ప్రార్థనలో రాజకీయ ప్రసంగాలు చేయొద్దని సూచించారు.

వైద్యరంగంలో నర్సుల పాత్ర కీలకం

- డాక్టర్లు దేవుళ్లతో సమానం
- సింగరేణి సీఎండీ బలరామ్‌

సింగరేణి(కొత్తగూడెం) : వైద్య రంగంలో నర్సుల పాత్ర కీలకమని, ప్రస్తుత సమాజంలో వారికి ఉన్న గుర్తింపు మరెవరికీ లేదని సింగరేణి సీఎండీ ఎన్‌.బలరామ్‌ అన్నారు. వైద్య వృత్తి ఎంతో విలువలతో కూడుకుందని, భగవంతుడు ప్రాణమిస్తే.. ఆ ప్రాణాలను కాపాడేది వైద్యులేనని చెప్పారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో రూ.3.46 కోట్లతో ఆధునికీకరించిన నర్సింగ్‌ కళాశాలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి డిశ్చార్జ్‌ అయ్యే వరకు నర్సులే ఎంతో అంకిత భావంతో సేవలందిస్తుంటారని, కొన్ని సందర్భాల్లో కుటుంబ సభ్యుల కంటే ఎక్కువ సేవ చేస్తారని కొనియాడారు. కొత్తగూడెంలోని సింగరేణి ఆస్పత్రి పాత భవనంలో ఈ కోర్సును 1960లో ప్రారంభించామని, 2010లో గోల్డెన్‌ జుబ్లీ నిర్వహించామని గుర్తుచేశారు. ఈ కళాశాలలో ఇప్పటివరకు 850మంది నర్సింగ్‌ కోర్సు పూర్తి చేశారని, వారిలో 500మంది నర్సులు సింగరేణి ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. బీఎస్సీ నర్సింగ్‌ కోర్సు కూడా ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. కార్మికులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రధానాస్పత్రి సహా అన్ని ఏరియాల ఆస్పత్రులను ఆధునికీకరిస్తామని తెలిపారు. సంస్థకు చెందిన డాక్టర్లు, నర్సులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తూ పేషెంట్లను రిఫర్‌ చేయకుండా సాధ్యమైనంత వరకు ఇక్కడే నయం చేయాలని కోరారు. త్వరలో సీటీ, ఎంఆర్‌ఐ స్కాన్‌ ప్రారంభిస్తామని ప్రకటించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన సీఎంఓ సుజాతను సన్మానించారు. డైరెక్టర్లు సత్యనారాయణరావు, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వాల్యూయేషన్‌ కేంద్రంలో పరిశీలన


యాదగిరికి వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

ఖమ్మం సహకారనగర్‌: ఇంటర్‌మీడియట్‌ జవాబపత్రాల మూల్యాంకనం కోసం ఖమ్మం నయాబజార్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో వాల్యూయేషన్‌ సెంటర్‌ కొనసాగుతోంది. ఈమేరకు కేంద్రాన్ని ఇంటర్‌మీడియట్‌ బోర్డుకు చెందిన పరిశీలకుడు సీహెచ్‌.యాదగిరి సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన అధ్యాపకులకు పలు సూచనలు చేయగా, డీఐఈఓ రవిబాబు, అసిస్టెంట్‌ క్యాంపు ఆఫీసర్లు పాల్గొన్నారు. కాగా, స్పాట్‌ విధులు నిర్వర్తిస్తున్న అధ్యాపకులకు రెమ్యూనరేషన్‌ చెల్లించాలని యాదగిరికి వినతిపత్రం అందించినట్లు తెలంగాణ గెజిటెడ్‌ జూనియర్‌ లెక్చరర్ల అసోసియేషన్‌ సంఘాల బాధ్యులు కె.సురేష్‌, గుమ్మడి మల్లయ్య, వినోద్‌బాబు, విజయ్‌, కిషోర్‌బాబు వినతిపత్రం అందజేశారు.

ప్రారంభమైన శ్రీ కోటమైసమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ ప్రతినిధులు

కారేపల్లి: కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో కొలువుదీరిన శ్రీ కోటమైసమ్మ తల్లి ఆలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. బుధవారం జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయ ఈఓ వేణుగోపాలాచార్యులు, పర్సా ట్రస్ట్‌ చైర్మన్‌ పర్సా పట్టాభిరామారావు నేతృత్వాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాశశర్మ, వేద పండితులు కొనమంచలి ఫణికుమార్‌ శర్మ తొలిరోజు మృత్యుంజయ అమృత పాశుపతం హోమం నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే, ఇల్లెందు మార్గదర్శి స్కూల్‌ ప్రతినిధులు అర్వపల్లి రాధాకృష్ణ, వేణుగోపాల్‌ గుప్తా సహకారంతో ఏర్పాటుచేసిన అన్నదానాన్ని దేవాదాయ, ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్‌ ఎం.వీరస్వామి ప్రారంభించారు. ఆలయ ఉద్యోగులు పగడాల మోహన్‌కృష్ణ, పర్సా లలిత్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీకి కాసుల పంట!

- ఆర్థిక సంవత్సరం చివరి రోజు రూ.3.62 కోట్ల ఆస్తిపన్ను వసూలు
- మొత్తంగా రూ.33.65 కోట్ల ఆదాయం



ఖమ్మంమయూరిసెంటర్‌: 2024–25 ఆర్థిక సంవత్సరం సోమవారంతో ముగియగా ఆస్తి పన్నుల వసూళ్లలో ఖమ్మం మున్సిపల్‌ కార్పొరేషన్‌కు కాసుల పంట పండింది. గడిచిన (2023–24) ఆర్థిక సంవత్సరంలో రూ.30.80 కోట్లు ఆస్తిపన్నుల ద్వారా రాబట్టగా.. ఈసారి సోమవారం రాత్రి 9గంటల వరకు రూ.33.65 కోట్లు వసూలవడం విశేషం. ఆర్థిక సంవత్సరం చివరి రోజైన సోమవారం ఏకంగా రూ.3.62 కోట్లు వసూలయ్యాయని అధికారులు వెల్లడించారు. ఉగాది, రంజాన్‌ సెలవులు ఉన్నా ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుచేసి మరీ పన్నుల వసూళ్లలో నిమగ్నం కావడంతో గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి రూ.2.85 కోట్లు అదనంగా వసూలు చేయగలిగారు. కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో కేఎంసీకి వివిధ రూపాల్లో రూ.38.72 కోట్ల ఆదాయం సమకూరింది.

2024-25లో వివిధ మార్గాల ద్వారా కేఎంసీకి వచ్చిన ఆదాయం

సేవలు	ఆదాయం (రూ.ల్లో)
సెల్ఫ్‌ అసెస్‌మెంట్‌	91,48,306
మ్యుటేషన్‌	5,39,801
ఆస్తి పన్ను	33,65,86,199
పంపు పన్ను	2,86,84,079
ట్రేడ్‌ లైసెన్సు	1,18,11,219
ఖాళీ స్థలంపై పన్ను	4,77,010

సూర్యాపేట వాసి ఆత్మహత్య

కల్లూరురూరల్‌: మండలంలోని రావికంపాడులో చెన్నం ప్రమోద్‌(36) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. సూర్యాపేట జిల్లాకు చెందిన ప్రమోద్‌ రావికంపాడులో అత్తగారింటికి కొద్దిరోజుల క్రితం వచ్చాడు. ఈమేరకు తన మామ మైలవరపు శ్రీనివాసరావు ఇంట్లో ఉరి వేసుకున్నాడు. అయితే, ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వేమన శతకంపై విద్యార్థుల అవధానం


విద్యార్థులను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

సత్తుపల్లిటౌన్‌: సత్తుపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు అవుల పోతురాజు, కడమంచి వంశీ వేమన శతకంపై అష్టావధానం చేసి ప్రశంసలు అందుకున్నారు. స్థానిక శ్రీజ్ఞానసరస్వతీదేవి ఆలయంలో ఈ అవధానం నిర్వహించగా.. ఎనిమిది అంశాల్లో పృచ్ఛకులు అడిగిన సమస్యలకు శతక పద్యాల ఆధారంగా సమాధానాలు చెప్పి మెప్పించారు. ఉపాధ్యాయులు రజినీదేవి, రమాదేవి ఆధ్వర్యాన ఈ అవధాన ప్రదర్శన ఏర్పాటుచేశారు. అనంతరం విద్యార్థులతో పాటు పలువురు కవులను ఆలయ కమిటీ నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొడిమెల అప్పారావు, ఎస్‌.ఎల్‌.నర్సింహారావు, మాదిరాజు పుల్లారావు, శర్మ, మల్లికార్జున్‌రావు, రమణమూర్తి, సాయిరాం, శేషాచార్యులు, రామప్ప, మాదిరాజు మాలతి, శేషగిరిరావు, గీతాకుమారి, బి.మధుసూదన్‌రాజు, రమణారావు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఖమ్మంరూరల్‌: మండలంలోని పోలేపల్లి సమీపాన మున్నేటిలో గుర్తు తెలియని వ్యక్తి(30) మృతదేహం సోమవారం లభ్యమైంది. మున్నేటిలో మృతదేహం తేలుతుండగా స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు అన్నం ఫౌండేషన్‌ చైర్మన్‌ అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని బయటకు తీశారు. అయితే, మృతుడి ఒంటిపై చొక్కా లేకపోగా, ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

డీసీసీబీ మాజీ చైర్మన్‌ వాహనానికి ప్రమాదం


దెబ్బతిన్న కారు, ఎదురుగా మృతి చెందిన గేదె

ఖమ్మంఅర్బన్‌: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌ మాజీ చైర్మన్‌ కూరాకుల నాగభూషణంకు ప్రమాదం తప్పింది. సోమవారం ఆయన ఖమ్మం నుండి సత్తుపల్లికి కారులో వెళ్తుండగా వీ.వీ.పాలెం వద్ద ఖమ్మం– వైరా ప్రధాన రోడ్డులో గేదె అడ్డుగా వచ్చింది. ఆ గేదెను తప్పించే క్రమాన దాన్ని ఢీకొట్టగా వాహనం ముందు భాగంలో దెబ్బతిన్నప్పటికీ అందులో ఉన్న నాగభూషణం, కారులో ఉన్న లింగయ్య సురక్షితంగా బయటపడ్డారు. వీరి వాహనం ఢీకొన్న గేదె మృతి చెందింది. ఈమేరకు నాగభూషణంను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్‌ తదితరులు పరామర్శించగా మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ప్రమాదంపై ఫోన్‌లో ఆరా తీశారు.

రంజాన్‌ వేళ విషాదం

- చెరువులో మునిగి తండ్రీకుమారుడి మృతి
- తండ్రిని రక్షించే క్రమాన కుమారుడు కూడా కన్నుమూత


పఠాన్‌ యూసుఫ్‌ ఖాన్‌ (ఫైల్‌)


కరీముల్లా (ఫైల్‌)

బోనకల్‌: ముస్లింలంతా రంజాన్‌ పండుగను ఘనంగా జరుపుకుంటుండగా ఆ కుటుంబంలో మాత్రం విషాదం నెలకొంది. చెరువులోకి దిగిన తండ్రిని కాపాడే యత్నంలో కుమారుడు కూడా గుంతలో చిక్కుకుని మృతి చెందిన ఘటన బోనకల్‌ మండలం ఆళ్లపాడు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు..... ఆళ్లపాడుకు చెందిన పఠాన్‌ యూసుఫ్‌ ఖాన్‌(72)కు మతిస్థిమితం సక్రమంగా ఉండడం లేదు. సోమవారం ఉదయం వారి ఇంటి ఎదురుగా ఉన్న చెరువులోకి ఓ గేదె వెళ్లడాన్ని చూసిన ఆయన సైతం దిగాడు. ఈ విషయాన్ని గమనించిన యూసుఫ్‌ పెద్ద కుమారుడు కరీముల్లా(45) తండ్రిని బయటకు తీసుకురావడానికి చెరువులోకి దిగాడు. అయితే, ఆయనకు ఈత రాకపోవడంతో ఇద్దరూ చెరువులో గత ఏడాది మట్టి తవ్వకాలతో ఏర్పడిన గుంతల్లో చిక్కుకున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు వారిని రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోగా నీట మునిగి మృతి చెందారు. దీంతో పండుగ వేళ నెలకొన్న విషాదంతో వారి కుటుంబీకుల రోదనలు గ్రామస్తులను కంటతడి పెట్టించాయి. యూసఫ్‌ ఖాన్‌కు భార్య, ముగ్గురు కుమారుల ఉండగా, కరీముల్లాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, ఆళ్లపాడు చెరువులో గతంలోనూ ముగ్గురు మృతి చెందగా, ప్రస్తుత ఘటనతో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుబాబు తెలిపారు.

250 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం స్వాధీనం


బియ్యం లారీ, డ్రైవర్‌తో పట్టుకున్న పోలీసులు

కామేపల్లి: అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన రేషన్‌ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సాయికుమార్‌ తెలిపిన వివరాలు... మండలంలోని పండితాపురానికి చెందిన ఓ వ్యాపారి శనివారం రాత్రి లారీలో బియ్యాన్ని లోడ్‌ చేసి తరలించేందుకు సిద్ధమవుతున్నాడనే సమాచారంతో తనిఖీలు చేపట్టారు. ఈమేరకు 250క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకోగా, వాహనంతో సహా సివిల్‌ సప్లయీ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.